క్లుప్తంగా

కార్పెంటర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంబికాపతి


అంబికాపతి ఆచారి

పీలేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా పీలేరుకు చెందిన అంబికాపతి ఆచారిని ఎన్నుకున్నారు. బుధవారం అనంతపురంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పీలేరుకు చెందిన అంబికాపతి ఆచారిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పప్పుసాని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నాడు- నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

పీలేరు : నాడు -నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రత్యేకాధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాల, బైపాస్ ఉర్దూ, బైపాస్ తెలుగు, కోటపల్లె ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు- నేడు పనులు పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసిన మెటీరియల్స్‌ను, పనుల పురోగతిని, విడుదల గ్రాంటు, ఖర్చు చేసిన గ్రాంటుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతిమ్మ, ఫీల్డ్ ఇంజనీరు రమేష్, హెచ్‌ఎం సురేంద్రరెడ్డి, సీఆర్పీ మురళీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు హర్షణీయం


మానవత కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల

కలికిరి : ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమని ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మానవత సంస్థ కలికిరి శాఖ ఆధ్వర్యంలో దాతల దాతృత్వంతో నూతనంగా నిర్మించిన కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. సంస్థ తమ సేవా కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను ఆ సంస్థ వ్యవస్థాపకులు సి.రామచంద్రారెడ్డి వివరించారు. కార్యక్రమంలో కలికిరి శాఖ చైర్మెన్ రత్నశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ ఉత్తమ రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

– జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్


పంటకోత ప్రయోగం చేపట్టిన అధికారులు

పీలేరు : మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎంసీపాలెంలో వేరుశెనగ పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 5కు 5 మీటర్ల విస్తీర్ణంలో 5.450 కేజీలు దిగుబడి వచ్చిందని, ఎకరాకు 16 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఎంసీపాళెంలో 43 పొలంబడి రైతుల వద్ద నుంచి అన్నమయ్య రైతు సహకార సంఘం ద్వారా వేరుశెనగ కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ సావిత్రి, ఏడీఏలు ఎం.వి. శ్రీకాంత్, వై.వి. రమణరావు, ఏవోలు సుచిత్ర, షణ్ముగం, రమాదేవి, కేవీకే కోఆర్డినేటర్ పాండురంగ, సైంటిస్ట్ సోమశేఖర్, ఏఈవోలు నజీర్, అల్తాఫ్, ఇంద్ర, జ్యోత్స్న, డీఏఏబీ మెంబర్ బోడేషా, ఆర్బీకే చైర్మన్ మల్లికార్జున, మాజీ సర్పంచ్ సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం


ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘీభావ యాత్ర

కేవీపల్లె : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కె.ఎస్. రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వై. రవీంద్ర మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్రకు మద్దతుగా గురువారం మండలంలోని వగ్గల పంచాయతీ కొండకింద హరిజనవాడ నుంచి సంఘీభావయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాలకు సంపూర్ణ న్యాయం జరగాలంటే ఏబీసీడీ వర్గీకరణ ఒక్కటే మార్గమన్నారు. వచ్చే నెల 7న హైదరాబాద్‌లో జరగబోవు విశ్వరూప మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, నాయకులు వెంకటరమణ, ముల్లంగి రెడ్డెప్ప, గురవయ్య, రమణ, రవీశ్వర, శ్రీనివాసులు, నాగేశ్వర, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. నమోస్తుతే..!


కలకడలో శ్రీమహాచండీదేవిగా దర్శనమిస్తున్న శ్రీచౌడేశ్వరిదేవి


మదనపల్లె సిటీ : అన్నపూర్ణేశ్వరి అలంకారంలో


అన్నపూర్ణదేవి అలంకారంలో శ్రీలతత్రిపురసుందరిదేవి


పీలేరు : కాత్యాయినిదేవి అలంకరణలో అంకాలమ్మ


వాల్మీకిపురం : అన్నపూర్ణాదేవిగా నల్లవీరగంగాభవాని


వాల్మీకిపురం : లలితాదేవిగా దర్శనమిస్తున్న కామేశ్వరి


గుర్రంకొండ : లలిత త్రిపురసుందరీదేవి అలంకారం


కలికిరి : మహాలక్ష్మిదేవి అలంకారంలో ఎల్లమ్మ


కలికిరి : లలితాదేవిగా పార్వతీదేవి దర్శనం


ములకలచెరువు : తమలపాకుల అలంకరణలో అమ్మవారు


పీలేరు : మోహినిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


తంబళ్లపల్లె: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : జగన్మాతా..నమోస్తుతే.. అంటూ భక్తజనం నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారిని శ్రీ కాళింగమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక కోటవీధి, మోతినగర్, ఆర్.ఆర్ వీధి ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో 60 సంవత్సరాలు నిండిన ఆర్యవైశ్య మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి అలంకారం చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలితత్రిపురసుందరిదేవి అమ్మవారిని శ్రీ అన్నపూర్ణదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక సిటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మి అలంకారం చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయం, కోర్టు ఆవరణంలోని గంగమ్మ, భువనేశ్వరినగర్‌లోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కాత్యాయినిదేవి అలంకరణలో..

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు కాత్యాయినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గురువారం ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక నెహ్రూబజార్‌లో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపర మేశ్వరి అమ్మవారు అమ్మవారి అర్చకులు ఆలయంలో చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, మోహినిదేవి అలంకరణ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

లలిత త్రిపురసుందరీదేవి అలంకారంలో..

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి లలిత త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం రెడ్డెమ్మతల్లితోపాటు గుర్రంకొండ గ్రామదేవతలైన గంగమ్మతల్లి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు లలిత త్రిపురసుందరీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయాల్లో అమ్మవారి కీర్తనలు, భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

వాల్మీకిపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గంగమ్మ గుడివీధిలోని శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు లలితాదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మిదేవిగా, చింతపర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులను కటాక్షించారు. నవరాత్రిని పురస్కరించుకొని స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో ఎనిమిది అలంకరణల్లో చిన్నారుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవార్లను ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.


మదనపల్లె సిటీ : ఒడిబియ్యం కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు


వాల్మీకిపురం : అమ్మవారి వేషధారణలో చిన్నారులు

మహాలక్ష్మి అలంకారంలో ఎల్లమ్మ

కలికిరి : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ గురువారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలో వెలసిన పార్వతీసమేత సోమేశ్వరాలయంలో దేవీనవరాత్రులు ఉత్సవాలలో భాగంగా గురువారం పార్వతీదేవి లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చనకు మహిళ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు.

శ్రీమహాచండీదేవిగా శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : దశరా మహోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె పంచాయతీలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవిని శ్రీమహాచండీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

తమలపాకుల అలంకరణలో..

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో గురువారం అమ్మవారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణేశ్వరి ఆశీర్వదించమ్మ..

తంబళ్లపల్లె : దసరా వేడుకలలో భాగంగా గురువారం మహిళలు అన్నపూర్ణేశ్వరి ఆశీర్వదించమ్మ అంటూ అమ్మవారికి పూజలు చేశారు. మల్లయ్యకొండ గౌరీదేవి ఆలయంలో అమ్మవారికి అన్నపూర్ణేశ్వరి అలంకరణతో పూజారి శేఖర్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి


అమృతకలశాన్ని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులకు అందిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : జన్మనిచ్చిన నేలతల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నా మట్టి – నా దేశం కార్యక్రమం ఎంతో మహోన్నతమైంది. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్నమయ్యజిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గ్రామజ్యోతి సొసైటీ నిర్వహణలో నియోజకవర్గ స్థాయిలో మేరీ మట్టి – మేరీ దేశ్ అమృత కలశయాత్ర జరిగింది. ఇందులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి జెడ్పీహైస్కూల్ వరకు అమృతకలశయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల భరతమాత వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ జాతీయజెండాను చేతిలో పట్టుకుని మేరా భారత్ మహాన్, ఐ లవ్ ఇండియా అంటూ చేసిన నినాదాలు దేశభక్తిని, సమైక్యతను, సమగ్రతను చాటాయి. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ లక్ష్మీపతి మాట్లాడుతూ...ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ముగింపులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటిక‌ను నిర్మించేందుకు దేశంలోని ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు తెలిపారు. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశం కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దేశం కోసం కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి దేశమాత సేవలో తరించిన మాజీ సైనికులు కెప్టెన్ ఆర్.వి.రమణ, సుబేదార్ అన్నయ్య, హవల్దార్ చలపతి, సుబేదార్ రామమూర్తి, సిద్ధలవేమారెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో అమృతకలశాన్ని డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్ చేతులమీదుగా కడప నెహ్రూ యువకేంద్రం డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ కే.మణికంఠకు అందించారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకులు సుభద్ర, వెలుగు భాగ్యలక్ష్మి, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, కలికిరి సైనిక్ స్కూల్ ఇండో టిబెట్ బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది ఆశిష్, వై.వి.రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నీరాల మండప స్థాపన పూజ


నీరాల మండపస్థాపన పూజ కార్యక్రమం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలోని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయ పుష్కరిణీ అభివృద్ధి పనుల్లో భాగంగా నీరాల మండపం స్థాపన పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ పుష్కరిణీ అభివృద్ధి పనులు రూ.30 లక్షలతో చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం పుష్కరిణీ అభివృద్ధి పనులకు సంబంధించి నీరాల మండపం స్థాపన పూజ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు పనులు పూర్తి అయితే అమ్మవారి పుష్కరిణి భక్తులకు అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల అర్చకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కలికిరి గ్రామ పంచాయతీ కలికిరి-2 సచివాలయంలో పరిధిలోని టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధి, నూరు కాలని, గిరిజనకాలని, పీలేరు రోడ్డు, వెంకటేశ్వరపురం, బాపూజీ నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. గత 52 నెలల కాలంలో ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి అందిన లబ్ధి వివరాలతో కూడిన సంక్షేమ బుక్‌లెట్‌ను అందచేసి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై విచారించారు. ఇంకా ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఏలాంటి సిఫారసులు లేకుండా నేరుగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే పథకాలు ఇంటి వద్దకే అందుతున్నట్లు వివరించారు. ఇంటింటికి బియ్యం పంపిణీలో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు భాగ్యలతను ఆదేశించారు. ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మెన్ సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, ఎంఐ హనీఫ్, ఎంపీడీఓ గంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలి

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి కోరారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లోని ఆర్డీఓ ఛాంబర్‌లో 164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్లజాబితా సవరణకు సంబంధించి రాజకీయపార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వో, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వారంలో జరిగిన ప్రగతిపై నివేదికలను అందజేశారు. ఫారం–6,7,8,9,10,11 కు సంబంధించి వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరుజాబితా సవరణపై ఏవేని అభ్యంతరాలు, ఇబ్బందులు ఉంటే తెలిపితే, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సందీప్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, వైస్‌చైర్మన్ జింకా చలపతి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, సీ.ఆర్. మంజుల, కాంగ్రెస్ పార్టీ రెడ్డిసాబ్, ఆప్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాష ప్రాచుర్యాన్ని విస్తరింపజేయాలి

వాల్మీకిపురం : ఉర్దూ భాషా ప్రాచుర్యాన్ని, గొప్పతనాన్ని విస్తరింపజేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ కోరారు. గురువారం వాల్మీకిపురంలోని ఉర్దూ అకాడమీ కేంద్రంలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాష ఎంతో ప్రాచీనమైనదన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉర్దూ భాషను ద్వితీయ అధికార భాషగా అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉర్దూ భాషలో ఆయా కార్యాలయాల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఉర్దూ అకాడమీ కేంద్రంలో వసతుల కల్పనకు విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ కరీమ్ సాహెబ్ రూ.5వేలు నగదు విరాళాన్ని అబ్దుల్ కలీమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో అమీర్ హుస్సేన్, జవాద్ హుస్సేన్, మహబూబ్‌బాషా, బషీర్ అహ్మద్, సాధిక్, మహబూబ్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

జానపద కళలను ఆదరించాలి

కేవీపల్లె : అంతరించిపోతున్న జానపద కళలను ప్రజలు ఆదరించాలని జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. మండలంలోని కేవీపల్లె పంచాయతీ బుర్రావాండ్లపల్లెలో నూతనంగా ప్రారంభించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద రెండు రోజులుగా మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన హరికథాకాలక్షేపం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ మహాభారత యజ్ఞంలో భాగంగా రాత్రి నాటకాలు, హరికథలు మన సాంస్కృతి, సాంప్రదాయాలు తెలపడంతోపాటు, ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


సమస్యలను అధికారులకు వివరిస్తున్న సభ్యులు

గుర్రంకొండ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ సీతమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ మీటర్లు ఒకచోట నుంచి మరొక చోటుకు మార్చుతున్నారని, విద్యుత్ సరఫరాను వ్యవసాయానికి విడతల వారీగా ఇవ్వాలని వైస్ ఎంపీపీ కరుణాకర్ అధికారులను కోరారు. సరిమడుగులో నిర్వహించిన రీసర్వేలో మొత్తం 760 మంది రైతులకుగానూ 70 మంది రైతులకు మాత్రమే రికార్డులు సరిగ్గా వచ్చాయని మిగిలిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అస్తవ్యస్తంగా వచ్చాయని సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. చెరువుమొరవపల్లెలో ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడంలేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ సరస్వతి అన్నారు. మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో వెంకటేశులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, రౌనఖ్‌భాషా, ఎంపీటీసీలు బాబయ్య, సరస్వతి, రాజగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

పేదల ఇంటి ముంగిటకే వైద్య సేవలు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మట్లివారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి


మదనపల్లె : దుబ్బిగానిపల్లెలో మెడికల్ కిట్లను అందజేస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

కురబలకోట : జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి అన్నారు. గురువారం మట్లివారిపల్లెలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డాక్టర్ కావడంతో ముందుచూపుతో ఆరోగ్యశ్రీని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి జనాదరణ పొందారన్నారు. ఆ మహానేత కుమారుడు సీఎం జగన్ మరో రెండు అడుగులు ముందుకేసి ఆరోగ్య సేవలను పల్లెల్లోకి తీసుకువచ్చారన్నారు. 3256 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించేందుకు చొరవ తీసుకున్నారన్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, మందులు కొరత లేదన్నారు. కొత్త ఆసుపత్రులను కూడా మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఎలా ఉంది..ఇప్పుడు ఎలా ఉందో ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. రోడ్డులేని ఊరు లేదన్నారు. సాగు తాగునీటి సమస్య లేదన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను దీవించాలని కోరారు. సురేంద్రనాథ్, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, బి. దస్తగిరి, డీఆర్ ఉమాపతిరెడ్డి, ఎన్వీ రమణారెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, విశ్వేశ్వర రెడ్డి, సోమిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, అంజాద్‌ఖాన్, తంబళ్లపల్లె నారాయణ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్

మదనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. ప్రజలకు ఆరోగ్యసేవలను మరింత చేరువ చేసేందుకు ఇదో బృహత్తర కార్యక్రమమని తెలిపారు. మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీలో ఎంపీడీఓ భానుప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైద్యశిబిరంలోని ప్రతి కౌంటర్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డన్న, ఎంపీటీసీ ప్రియాంక, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్, డాక్టర్లు, ఏఎన్‌ఎంయూలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

పెద్దమండ్యం : గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి నాణ్యమైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' లక్ష్యమని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీ పాతూరు ప్రభుత్వ పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంప్‌కు వచ్చిన ప్రజలకు, రోగులకు డాక్టర్‌లు చికిత్సలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో 2 రామక్రిష్ణ, డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, నజ్మ, సిహెచ్‌వో క్రిష్ణయ్య, ఈవోపీఆర్‌డి జనార్దన్, గ్రామ సర్పంచ్ పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

552 మందికి వైద్యసేవలు

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 552 మందికి వైద్యసేవలు అందించినట్లు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, డెంగ్యూ, మలేరియా, కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి నలుగురిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వైద్యసేవల తోపాటు పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వైద్యులు డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం

నిమ్మనపల్లె : పేదల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కె.సదాశివారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రమణారెడ్డి అన్నారు. గురువారం రెడ్డివారిపల్లె సచివాలయ పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్షలో నమోదు చేసుకున్న ప్రజలకు రెడ్డివారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

పేదలకు వరం

రామసముద్రం : పేదలకు జగనన్న సురక్ష కార్యక్రమం వరంలాంటిదని జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆర్.నడింపల్లె గ్రామంలో సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబరు కొండూరు కృష్ణారెడ్డి , కన్వీనర్ నంద, ఎంపీటీసీ రెడ్డిశేఖర్‌యాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.